క్లుప్తంగా

పోలీసుల త్యాగాలపై షార్ట్ ఫిల్మ్‌లు పంపాలి

నడిగూడెం : ఈ నెల 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసుల త్యాగాలను తెలిపేలా తీసిన షార్ట్‌ఫిల్మ్‌లు, ఫొటోలను తీసి ఉంటే తనకు పంపాలని నడిగూడెం ఎస్‌ఐ గండమళ్ల అజయ్ కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలానికి చెందిన షార్ట్ ఫిల్మ్ మేకర్స్, రీల్స్ మేకర్స్ పోలీసుల త్యాగాలను చూపే విధంగా తీసి పంపాలన్నారు. ఇందులో ఉత్తమమైన వాటిని ఎంపిక చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధన్వంతరికి ఘన నివాళి



ధన్వంతరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

కోదాడరూరల్ : ఆయుర్వేద వైద్యానికి ఆద్యుడు భగవాన్ ధన్వంతరి అని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు అన్నారు. శనివారం పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సంఘం భవన్‌లో ధన్వంతరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ మండలాధ్యక్షుడు ఆలేటి గోపి, నాయకులు సురభి నర్సయ్య, పెద్ద సత్యనారాయణ, పాలూరి సత్యనారాయణ, శ్రీహరి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



మాలధారులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న దాతలు

మునగాల: మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్త బృందం సహకారంతో సుమారు 200 మంది మాలధారులకు అన్నప్రసాద వితరణ చేపట్టినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీను గురుస్వామి తెలిపారు.

మట్టపల్లిలో వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ముందుగా పూజలు చేసి స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. అనంతరం కల్యాణం నిర్వహించి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మాచార్యులు, సుబ్రహ్మణ్యం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గీత పనివారలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



గీత పనివారల సంఘం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : గీత పనివారలకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు వి.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం వ్యవస్థాపక దినోత్సం సందర్భంగా హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సంఘం జెండాను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గీత కార్మికులకు ఆరోగ్య బీమా ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో గీత కార్మికుల కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి ప్రత్యేక ప్రయోజనాలు చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి. వెంకటేశ్వర్లు, డి. సత్యనారాయణ, ఎస్. కృష్ణ, బి. సత్యనారాయణ, కె. మట్టయ్య, సీహెచ్. సైదులు, బి. శ్రీను, డి. వెంకటేశ్వర్లు, బి. మల్లయ్య, ప్రసాద్, శంభులింగం పాల్గొన్నారు.

కోదాడ జంక్షన్ జామ్

- కోదాడ-హుజూర్‌నగర్ బైపాస్ జంక్షన్ వద్ద తీవ్ర ట్రాఫిక్ జామ్
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణంతో వాహనాల దారి మళ్లింపు
- జంక్షన్ వద్ద రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు
- వాహనాల రద్దీ పెరగడంతో తీవ్ర ఇబ్బందులు



కోదాడ- హుజూర్‌నగర్‌రోడ్డు జంక్షన్



జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్

కోదాడ: పట్టణంలో వాహనాల రద్దీ పెరగడంతో ఇప్పటికే ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దానికి తోడు కోదాడ-హుజూర్‌నగర్ బైపాస్ జంక్షన్ వద్ద కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై కొమరబండ వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తుండడంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను హుజూర్‌నగర్ రోడ్డు బైపాస్ ఫ్లైఓవర్ మీదుగా మళ్లించారు. ప్రస్తుతం పండుగల సీజన్ కావడం, ఇక్కడ జంక్షన్ నిర్మాణంలో అనేక లోపాలు ఉండడం, రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు పెరగడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది.

జంక్షన్ నిర్మాణంలోనే లోపాలు

హుజూర్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు, విజయవాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్లే వాహనాలతో పాటు హైదరాబాద్ నుంచి హుజూర్‌నగర్ వచ్చే వాహనాలు సైతం ఈ జంక్షన్ నుంచే వెళ్లాల్సి ఉంది. ట్రాఫిక్ మళ్లింపు కోసం ఇక్కడ ఏర్పాటు చేసిన డివైడర్లు ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాలు మళ్లడం ఇబ్బందిగా మారింది. ఫలితంగా గంటల కొద్దీ వాహనాలు నిలిచి పోతున్నాయి. దానికి తోడు విజయవాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వాహనాలు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు వెంటే హోటళ్లు ఏర్పాటు చేయడంతో భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

ఫుట్‌పాత్ ఆక్రమణ

కోదాడ-హుజూర్‌నగర్ బైపాస్ వద్ద ఉన్న జంక్షన్ ఇరుకుగా ఉండగా కొందరు వ్యాపారులు ఫుట్‌పాత్‌ను సైతం పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. దాంతో వాహన దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరి కొందరు రోడ్డును ఆనుకొనే హోటళ్లు నిర్మించడం, జంక్షన్ వద్ద ఉన్న వైన్‌షాపు ఎదుటే మందు బాబులు తమ వాహనాలు నిలుపుతుండడంతో జంక్షన్ పూర్తిగా జామ్ అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హుజూర్‌నగర్ రోడ్డుపై ఉన్న డివైడర్లను పూర్తిగా తొలగించి రోడ్డును విశాలంగా మార్చాలని, రోడ్డుపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని వాహన దారులు కోరుతున్నారు.

రోడ్డు బాగుచేయాలని మహిళల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న మహిళలు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి-హుజూర్‌నగర్ ప్రధాన రహదారి చౌటపల్లి వద్ద పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ మహిళలు ఆదివారం రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డు ధ్వంసమవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్మలేచి తమ ఇండ్లలోకి వస్తుందని, తాము అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం, కనీసం దుమ్ములేవకుండా నీళ్ల చల్లే వారు కూడా లేకుండా పోయారని విమర్శించారు. మహిళల రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న మఠంపల్లి ఎస్ఐ పెదవంగ బాబు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. రోడ్డు బాగుచేయకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



అఖిల్ (ఫైల్)

కోదాడరూరల్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం శివారులో శనివారం అర్ధరాత్రి జరిగిన బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం నల్లబండగూడేనికి చెందిన పిడతల రాము(35) ఎనీ టైమ్ డీజిల్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లిన తర్వాత రెడ్లకుంటకు చెందిన తన స్నేహితుడు మల్లెల గోపి కలిశాడు. ఇద్దరు కలిసి పని నిమిత్తం బైక్‌పై కోదాడకు వచ్చి తిరిగి వెళ్తుండగా.. మార్గమధ్యలో శ్రీరంగాపురం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాము అక్కడికక్కడే మృతిచెందాడు. గోపి తీవ్రంగా గాయపడ్డాడు. గోపిని కోదాడ ప్రభుత్వ తరలించగా.. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తరలించారు. మృతుడు రాముకు భార్య లిఖిత, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధీర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు అంటున్నారు. కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉన్న రాము మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సందర్శించి నివాళులర్పించారు.

చెరువులో పడి యువకుడి మృతి

మోతె : మండలంలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన సురేశ్‌రెడ్డి(32) శనివారం రాత్రి గ్రామ శివారులోని ఊర కుంటలో పడి మృతి చెందాడు. సురేశ్‌రెడ్డి శనివారం రాత్రి మద్యం సేవించి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న అతను ప్రమాదవశాత్తు ఊర చెరెవులో జారిపడి మృతి చెందాడు. ఆదివారం తెల్లవారు జామున గ్రామస్తులు చెరువులో సురేశ్‌రెడ్డి మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృత దేహానికి సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

బీజేపీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలి

- బీసీ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : బీసీ బిల్లును షెడ్యూల్ 9లో చేర్చకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని, అందుకే రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తక్షణమే రాజీనామా చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌కు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరుగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు అగ్రవర్ణాల వారికే టికెట్లు ఇచ్చాయని, కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే బీసీ వ్యక్తి టికెట్ ఇచ్చిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి జిల్లా నాయకులు చిలకరాజు శ్రీను, కోమ్రరాజు వెంకట్, మనోజ్ పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు స్వామివారికి విశేష మహాన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమపూజ, నవవిధ హారతులు, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు వాలీబాల్ పోటీలు

నడిగూడెం : దీపావళి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎలుగూరి సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలుగూరి వెంకటేశ్వర్లు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3వేలు, మూడో బహుమతిగా రూ.2వేలు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు నేరుగా క్రీడా ప్రాంగణానికి హాజరు కావాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములమవుతాం



మాట్లాడుతున్న డాక్టర్ రామారావు

కోదాడ : సామాజిక సేవా కార్యక్రమాల్లో కోదాడ ఎల్డర్స్ రీక్రియేషన్ క్లబ్ భాగస్వామిగా ఉంటుందని.. విద్య, విజ్ఞానం, క్రీడా, సాంస్కృతిక అంశాల్లో యువతను ప్రోత్సహిస్తుందని ఆ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఏటుకూరి రామారావు తెలిపారు. ఆదివారం కోదాడ ఎల్డర్స్ రీక్రియేషన్ క్లబ్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో తమ సభ్యుల గౌరవాన్ని పెంచే విధంగా క్లబ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. సమావేశంలో డాక్టర్ సుబ్బారావు, చక్కెల చిన్నపరెడ్డి, ఆవుల రామారావు, రామినేని శ్రీనివాసరావు, తోట రంగారావు, ఎండీ.జాకీర్, ఇమ్మడి రమేష్, పెదనాటి వెంకటేశ్వరరావు, తూమాటి సురేష్‌రెడ్డి, మదాల శ్రీధర్, బ్రహ్మయ్య, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువులో మాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి మాసకల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యావచనము, మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కల్యాణ తంతుపూర్తి చేవారు. ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయ శర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూర్‌నగర్ : విజేతలకు బహుమతులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987- 88 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండలంలోని లింగగిరిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.నాగరాజు, కె. కోటేశ్వరరావు, రవీందర్, విజయ శంకర్, రామనరసింహారావు, జానిపాషా, సీహెచ్. శ్రీను, వెంకట్రావు, ఎస్. యాదగిరి, ఎం. శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 1992 నుంచి 1997 వరకు 6నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు.



నేరేడుచర్ల : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బైక్‌ను ఓవర్‌టేక్ చేసినందుకు దాడి

- ఇద్దరు యువకులకు గాయాలు
- గొడవను నిలువరించిన వ్యక్తిపైనా దాడి

అనంతగిరి : బైక్‌ను ఓవర్ టేక్ చేసినందుకు ఇద్దరు యువకులపై దాడికి పాల్పడిన ఘటన అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని తమ్మరబండపాలెం శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బొజ్జగూడెం తండాకు చెందిన యువకులు మనోహర్, చందులు బైక్‌పై కోదాడకు బయల్దేరారు. తమ్మరబండపాలెం శివారులో కొందరు యువకులు వెళ్తున్న బైక్‌ను వారు ఓవర్‌టేక్ చేశారు. దాంతో ఆగ్రహించిన సదరు యువకులు పెట్రోల్‌బంక్ వద్ద మనోహర్, చందును అడ్డగించి దాడికి పాల్పడ్డారు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న బొజ్జగూడెం గ్రామానికి చెందిన గుగులోతు శ్రీనివాస్ దాడికి పాల్పడుతున్న వారిని వారించాడు. దాంతో మరింత ఆగ్రహించిన యువకులు శ్రీనివాస్‌పైనా దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ కొడుకు హేమంత్ నాయక్ ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన తండ్రిని ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా అతడిపైనా దాడికిపాల్పడ్డారు. ఈ దాడిలో శ్రీనివాస్, హేమంత్ నాయక్‌కూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ తండ్రి పంతులునాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు అనంతరం నిందితుల పేర్లను వెల్లడిస్తామని ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

ప్రతిభను వెలికితీసేందుకే స్కాలర్‌షిప్ టెస్ట్



విజేతలకు బహుమతులు అందిస్తున్న రాజేశ్‌చౌదరి

కోదాడరూరల్ : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే స్కాలర్‌షిప్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు శ్రీనిధి ఫౌండేషన్ చైర్మన్ వడ్డె రాజేశ్ చౌదరి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఆర్ఎస్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టులో 950 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిభ కనబర్చిన పది మందికి స్కాలర్‌షిప్‌ను అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ వెంకటరమణ, అకడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య పాల్గొన్నారు.

మానవ వికాస వేదిక అధ్యయన తరగతులు



మాట్లాడుతున్న మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు సాంబశివరావు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఆదివారం మానవ వికాస వేదిక అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు సాంబశివరావు హిందూ జాతీయవాద ఆర్ఎస్ఎస్ అంశంపై ప్రసంగించారు. అదేవిధంగా కేంద్ర సహాయ కార్యదర్శి డి.హనుమంతరావు భారత రాజ్యాంగం విలువల పరిరక్షణ, ఆవశ్యకత అనే అంశంపై మాట్లాడారు. మత సంస్కృతి, మానవవాదం అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు టి.భాస్కర్ మాట్లాడగా.. జీవం, జీవపరిణామం అనే విషయంపై రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దుర్గాప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.అంజయ్య, కోశాధికారి వి.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, కె.అంజయ్య, వి.వెంకటేశ్వర్లు, కె.సైదులు, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో భగవద్గీత సత్‌సంగం



విష్ణుసహస్ర నామ పారాయణంలో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో ఆదివారం భగవద్గీత సత్‌సంగం నిర్వహించారు. కార్యక్రమంలో భగవద్గీత ప్రచారకులు, హైదరాబాద్ ఇస్కాన్ టెంపుల్ ప్రభుజీ హృషికేశ దాస్ పాల్గొని ఉపదేశాలు చేశారు. మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీమన్నారాయణ, పేరూరి అశోక్, ఆంజనేయులు, చంద్రశేఖర్, రాధ, నాని, సతీశ్, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ రాజును ఆదుకుంటాం



రాజును పరామర్శిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన కార్టూనిస్ట్ సరికొండ రాజును అన్ని విధాలుగా ఆదుకుంటామని మేడ్చల్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. పది సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్న రాజును ఆదివారం కోటిరెడ్డి పరామర్శించారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉత్తమ కార్టూనిస్టుగా రాజు పలు అవార్డులు అందుకున్నాడని తెలిపారు. తల్లిదండ్రులు లేని రాజును ఇన్ని రోజులు పిన్నమ్మ ఆదుకుందని, ఇటీవల అనారోగ్యంతో ఆమె మృతి చెందినట్లు చెప్పారు. ఈ కష్ట సమయంలో రాజును ఆదుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. డీసీపీ వెంట కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు నాగిరెడ్డి విజయమ్మ, గ్రామస్తులు సరికొండ హనుమంతరాజు, పందిరి బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి ఉన్నారు.

మరుగుదొడ్ల సమస్య తీర్చేలా..

- కోదాడ ప్రభుత్వ బాలికల పాఠశాలలో కొత్తగా 16 టాయిలెట్స్
- రూ.13 లక్షలతో రెండంతస్తుల్లో నిర్మాణం
- పనులు ప్రారంభించిన యంత్రాంగం
- 600 మంది బాలికలకు ఊరట

సాక్షి ఎఫెక్ట్..

కోదాడ: కోదాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నెలకొన్న మరుగుదొడ్ల (టాయిలెట్స్) సమస్యకు 'సాక్షి' కథనం శాశ్వత పరిష్కారం చూపింది. పాఠశాలలో చదువుతున్న 600 మంది బాలికలకు సరిపడా మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకేఒక్క మరుగుదొడ్డి ఉండడంతో దాన్నే అందరూ వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో టాయిలెట్‌కు వెళ్లేందుకు గంట సమయం పాటు బారులుదీరాల్సిన పరిస్థితి నెలకొనేది. ఈ సమస్యపై ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనం స్థానిక నాయకుల నుంచి రాష్ట్ర స్థాయి అధికారులను కదిలించింది. బాలికల సమస్య పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై ఉన్నతాధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ఎట్టకేలకు రూ.13 లక్షలు మంజూరు చేసి వెంటనే పనులు మొదలుపెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశింశారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించారు.



కొనసాగుతున్న నిర్మాణ పనులు

రెండు అంతస్తుల్లో 16 టాయిలెట్స్ నిర్మాణం

బాలికల పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం అధికారులు సిద్ధమవ్వగా అక్కడ స్థల సమస్య వచ్చింది. ప్రస్తుతం ఉన్న టాయిలెట్స్ ప్రదేశంలో రెండు అంతస్తుల్లో మొత్తం 16 టాయిలెట్స్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. నిర్మాణం కోసం సామగ్రిని తీసుకొచ్చిన కాంట్రాక్టర ప్రస్తుతం పిల్లర్స్ పోస్తున్నారు. వారం పది రోజుల్లో స్లాబ్ వేసి, ఆ తరువాత పైఅంతస్తులో నిర్మాణ పనులు మొదలు పెడతామని కాంట్రాక్టర్ చెబుతున్నారు. రెండంతస్తుల్లో టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తయితే పైన, కింద క్లాస్ రూమ్‌ల్లో ఉండే బాలికలతోపాటు ఉపాధ్యాయులకు ఊరట కలగనుంది. బాలికల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించినందుకు బాలికల తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గుచ్చుకుంటున్నయ్.. కత్తిరించరూ.!



డివైడర్ దాటి బయటకు వచ్చిన బోగన్ విల్లియా కొమ్మలు

కోదాడ : పట్టణంలోని సంత ప్రాంతం నుంచి శ్రీరంగాపురం వరకు రోడ్డు డివైడర్ మధ్యలో మున్సిపల్ అధికారులు కాగితపు పూల మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం పెరిగి పెద్దవయ్యాయి. ముళ్లతో కూడిన ఈ మొక్కల కొమ్మలు డివైడర్‌దాటి రోడ్డుమీదకు రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొక్కల కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించాల్సిన మున్సిపల్ సిబ్బంది, పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పూలచెట్ల కొమ్మలు బైక్‌పై వెళ్లే వారి కళ్లకు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. కొమ్మలకు ముళ్ల కారణంగా తాము గాయాల బారిన పడుతున్నామని పలువురు వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు డివైడర్ మధ్యలో ఉన్న మొక్కల కొమ్మలను కత్తిరించాలని స్థానికులు కోరుతున్నారు.